తీవ్ర సంక్షోభంలో విద్యారంగం

- ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి
- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థి మహా గర్జన ధర్నా
- ప్రజా పాలన అంటే ఇదేనా?: ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు

విద్యార్థులను అరెస్టు చేస్తున్న పోలీసులు – మహా గర్జనలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

చిక్కడపల్లి, సెప్టెంబర్ 27: తెలంగాణ రాష్ట్రంలో నేడు విద్యారంగం తీవ్ర సంక్షోభం లో ఉందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. రాష్ట్రంలో తక్షణమే విద్యాశాఖ మంత్రిని నియమించాలని, సంక్షే మ వసతి గృహాలు, గురుకుల సమస్యలు పరిష్కరించాలని, ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలని, తదితర సమస్యలు పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ ధార్నా చౌక్ వద్ద విద్యార్థి 'మహా గర్జన' ధర్నా నిర్వహించారు. 33 జిల్లాల నుంచి వేలాది మంది విద్యార్థులు ధర్నాకు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ నర్సిరెడ్డి హాజరై మాట్లాడారు. రాష్ట్రం లో ప్రజా పాలన పేరుతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎనిమిది నెలలు గడిచినా రాష్ట్ర వి ద్యా రంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కా రానికి కృషి చేయడం లేదని మండిపడ్డారు. మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు రాష్ట్ర వ్యా ప్తంగా 1864 ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే కుట్ర చేస్తోంద న్నారు. ప్రభుత్వాలు వి ద్యా రంగానికి సరిపడినన్ని నిధులు కేటాయించడం లేదని చెప్పారు. ప్రైవేట్ ఫీజుల కోసం చట్టం తీసుకువస్తానని హామీ హామీగానే ఉంద ని ఆరోపించారు. ఉచిత విద్య మన హక్కు కా గా, నేడు అది వ్యాపారమైందని చెప్పారు. ప్రభుత్వ అండతోనే కార్పొరేటర్ మాఫియా, కోచింగ్ సెంటర్లు, ఇంజనీరింగ్ కళాశాలలు, డొనేషన్లు ర్యాంకుల ఆశ చూపి లక్షల రూపాయలు దండుకుంటున్నారని ధ్వజ మెత్తారు. ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలల్లో ఫీజులు విపరీతంగా పెంచారని, దోస్తు ద్వారా ఉచితంగా అడ్మిషన్ పొందిన మళ్లీ ఫీజులు గుంజుతున్నారని ఆరోపించారు. పెండింగ్ ఫీజు రియంబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్ విడుదల చేయాలని డి మాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కా ర్యదర్శులు ఆర్ఎల్ మూర్తి, టి.నాగ రాజు అధ్యక్షతన జరిగిన ధర్నాలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చావా రవి, టీపీటీఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ విజయ్, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి వెంక టేశ్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజినీకాంత్, శ్రీకాంత్ వర్మ, సంతోష్, శంకర్, ప్రశాంత్, వీర భద్రం, పూజ, కిరణ్, మమత, అశోక్‌రెడ్డి, శంకర్ రమేశ్ పాల్గొన్నారు.

నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరు

ధర్నా అనంతరం సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులు ర్యాలీగా సెక్రెటేరియట్ బయలు దేరారు. అప్పటికే పెద్ద ఎత్తున మోహరించిన పోలీసులు ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులను అరెస్టు చేశారు. విద్యార్థులను ఈడ్చుకెల్లి అరెస్టులు చేయడంతో పలువురికి గాయాలయ్యాయి. విద్యార్థులను బొల్లారం తదితర పీఎస్‌లకు తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎల్ మూర్తి, టి.నాగరాజు మాట్లాడుతూ, ప్రజా పాలన అంటే ఇదేనా? అని ప్రశ్నించారు.

ఉద్యమాలకు స్ఫూర్తి ప్రదాత లక్ష్మణ్ బాపూజీ

జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి

కొండాలక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళులర్పించిన కమిషనర్ ఆమ్రపాలి కాట, ఉద్యోగులు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 27(నమస్తే తెలంగాణ): స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమ నేత కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యమాలకు స్ఫూర్తి ప్రదాత అని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతిని పురస్కరించుకుని జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిషనర్ ఆమ్రపాలి పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ స్వయం పాలన, ఆత్మగౌరవం కోసం పోరాటం చేసిన తొలి తరం ఉద్యమనేత అని, తెలంగాణ అస్థిత్వాన్ని చాటేందుకు కొండా లక్ష్మణ్ చేసిన రాజీలేని పోరాటం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయమన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు అశోక్ సామ్రాట్, యాదగిరి రావు, చీఫ్ ఎంటమాలజిస్ట్ డా.రాంబాబు, పీఆర్వో విజయలక్ష్మి, ఏఎంసీలు శారద, రమణ పాల్గొన్నారు.

మూసీ పరీవాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సిటీబ్యూరో, సెప్టెంబర్ 27(నమస్తే తెలంగాణ): మూసీ నది పరీవాహక ప్రాంతంలో అడపాదడపా కురుస్తున్న వర్షాలకు ఉస్మాన్‌సాగర్ జలాశయం ఇన్‌ఫ్లో 500 క్యూసెక్కులకు పెరిగిందని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్‌ఫ్లోతో పాటు జలాశయం ఎఫ్‌టీఎల్ స్థాయికి చేరుకోవడంతో మరో రెండు గేట్లను ఒక అడుగు ఎత్తుకు తెరిచి 484 క్యూసెక్కులను మూసీలోకి విడుదల చేశామని ఆమె తెలిపారు. ప్రవాహ ఉధృతి నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని, మూసీ నది పరీవాహక ప్రాంతం లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలను అప్రమత్తం చేసి అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు.

గ్లామన్ మిసెస్ ఇండియాగా హేమలతా రెడ్డి

సిటీబ్యూరో, సెప్టెంబర్ 27(నమస్తే తెలంగాణ): గ్లామన్ మిసెస్ ఇండియా-2024 కిరీటాన్ని టాలీవుడ్ హీరోయిన్ హేమలతా రెడ్డి కైవసం చేసుకున్నారు. 'నిన్ను చూస్తూ' సినిమా హీరోయిన్ హేమలతా రెడ్డి బెస్ట్ టాలెంట్, బెస్ట్ ఫొటోజెనిక్ అవార్డులను అందుకున్నట్టు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాగా, మలేషియాలో ఈ అవార్డును ఆమె అందుకున్నట్టు తెలిపారు.

గండిపేట జలాశయం మరో రెండుగేట్ల ఎత్తివేత

సిటీబ్యూరో, సెప్టెంబర్ 27(నమస్తే తెలంగాణ): ఎగువ ప్రాంతాల నుంచి గండిపేట జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. దీంతో ఈ జలాశయం మరో రెండు గేట్లను అధికారులు శుక్రవారం ఒక అడుగు మేర ఎత్తి 242 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. దీంతో ఇప్పటి వరకు మొత్తం నాలుగు గేట్ల ద్వారా 484 క్యూసెక్కుల వరద నీటిని విడుదల చేస్తున్నారు. అటు హిమాయత్ సాగర్ జలాశయం ఒక గేటు ద్వారా 348 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాగా, హిమాయత్ సాగర్‌కు 500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది.

వండర్ లాలో కొత్త రైడ్స్ ప్రారంభం

సినీ నటుడు అక్కినేని నాగ చైతన్య చేతుల మీదుగా..

సిటీబ్యూరో, సెప్టెంబర్ 27(నమస్తే తెలంగాణ): నగర వాసులను అలరించేందుకు ఔటర్ రింగు రోడ్డు సమీపంలో ఉన్న వండర్‌లా ఎమ్యూజ్‌మెంట్ పార్కులో కొత్త రైడ్స్‌ను సినీ నటుడు అక్కినేని నాగ చైతన్య, వండర్ లా హాలీడేస్ మేనేజింగ్ డైరెక్టర్ అరుణ్ కె.చిట్టిలపల్లితో కలిసి ప్రారంభించారు. నాగచైతన్య మాట్లాడుతూ, హైదరాబాద్ వండర్ లాలో అద్భుతమైన ఆకర్షణలు సందర్శకులను అలరిస్తాయన్నారు. మన దేశానికి ప్రపంచ స్థాయి రైడ్‌లను వండర్ లా ఎలా తీసుకువస్తుందో చూడటం చాలా థ్రిల్లింగ్‌గా ఉందన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ అరుణ్ కె.చిట్టిలపలి మాట్లాడుతూ, దేశంలోనే అతి పెద్ద అమ్యూజ్‌మెంట్ పార్కుల్లో ఒకటైన వండర్ లా పర్యాటకులకు మంచి వినోదాన్ని, గొప్ప అనుభూతినిచ్చేలా కొత్త జీ ఫాల్, ఒక ఎత్తయిన జీ ఫాల్ రైడ్‌లు ఉంటాయని ఎమ్డీ తెలిపారు. సాటిలేని వినోదాన్ని అందించేందుకు, సందర్శకుల అనుభవాన్ని పెంచడానికి వండర్‌లా కొత్త రైడ్స్‌ను తీసుకువచ్చిందని తెలిపారు. వీటితో పాటు హైపర్ వర్స్, అత్యాధునిక మెటావర్స్, త్రీడీ థియేటర్ అనుభవాన్ని ఇస్తుందన్నారు. కార్యక్రమంలో వండర్ లా హైదరాబాద్ సీఓఓ ధీరన్ చౌదరి, పార్క్ హెడ్ మధుసూదన్ గుప్తాలు పాల్గొన్నారు.

సీవరేజ్, ఇంకుడు గుంతలపై ప్రత్యేక దృష్టి

- అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు స్పెషల్ డ్రైవ్
- జల మండలి ఎండీ అశోక్ రెడ్డి

జల మండలి వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ఎమ్డీ అశోక్ రెడ్డి

సిటీబ్యూరో, సెప్టెంబర్ 27(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మహా నగరాన్ని సీవరేజ్ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీగా మార్చాలనే లక్ష్యంతో 90 రోజుల స్పెషల్ డ్రైవ్ చేపడ్తున్నామని జల మండలి ఎమ్డీ అశోక్ రెడ్డి తెలిపారు. సీవరేజ్ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీతో పాటు భూగర్భ జలాలు పెంచడానికి అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు స్పెషల్ డ్రైవ్ చేపట్టబోతున్నామని, ఈ కార్యక్రమం అక్టోబర్ 2 గాంధీ జయంతి సందర్భంగా ప్రారంభిస్తున్నట్లు అశోక్ రెడ్డి తెలియజేశారు. ఖైరతాబాద్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో శుక్రవారం జల మండలి సీజీఎంల నుంచి మేనేజర్ వరకు స్పెషల్ డ్రైవ్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన అశోక్ రెడ్డి మాట్లాడుతూ, ఈ స్పెషల్ డ్రైవ్‌లో తరచు వచ్చే సీవరేజ్ సమస్యలపై వచ్చే ఫిర్యాదులను తగ్గించుకోవడంతో పాటు దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను గుర్తించి, వాటికి శాశ్వత పరిష్కారం చూపించాలన్నారు. ఈ మూడు నెలల పనితీరు ఎంసీసీ ఫిర్యాదులపై ప్రభావం చూపిస్తుందని, ఈ డ్రైవ్‌లో సమర్థంగా పనిచేస్తే 30-40 శాతం ఫిర్యాదులను తగ్గించవచ్చని పేర్కొన్నారు. అంతే కాకుండా ప్రజలకు మురుగునీటి నిర్వహణపై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. భవిష్యత్‌లో వాటర్ ట్యాంకుల అవసరం లేకుండా ఇంకుడుగుంతల నిర్మించుకునేలా చూడాలన్నారు. ఈడీ మయాంక్ మిట్టల్ మాట్లాడుతూ, ఒక నగర శుభ్రత దాని మురుగునీటి నిర్వహణపైనే ఆధారపడి ఉంటుందన్నారు. ఈ స్పెషల్ డ్రైవ్ విజయవంతం చేయడానికి క్షేత్రస్థాయి సిబ్బంది, అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం, సీవరేజ్‌పై ఈఎన్సీ, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, ఇంకుడు గుంతల నిర్మాణంపై ప్రత్యేక అధికారి సత్యనారాయణ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అంతకు ముందు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా అధికారులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టెక్నికల్ డైరెక్టర్ రవి కుమార్, డైరెక్టర్ ఆపరేషన్స్ స్వామి, పర్సనల్ డైరెక్టర్ సుదర్శన్, ఆపరేషన్స్ డైరెక్టర్ విజయా రావు, సీజీఎంలు, జీఎంలు, డీజీఎంలు, మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో లక్ష్మణ్ బాపూజీ జయంతి

సిటీబ్యూరో, సెప్టెంబర్ 27(నమస్తే తెలంగాణ): బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడిన వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ అని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతి శుక్రవారం ఘనంగా జరిగింది. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి కలెక్టర్ నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కదిరవన్, తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ జిల్లా ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల కార్యవర్గం

నూతన అధ్యక్షుడు వి.ప్రసాద రావు,

ప్రధాన కార్యదర్శి జె.బాలయ్య

కాచిగూడ, సెప్టెంబర్ 27: హైదరాబాద్ జిల్లా ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని నాంపల్లిలోని జూనియర్ లెక్చరర్ల సంఘం కార్యాలయంలో శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వి.ప్రసాద రావు, ప్రధాన కార్యదర్శిగా జె.బాలయ్య, ఉపాధ్యక్షుడిగా నర్సిరెడ్డి, కోశాధికారిగా డాక్టర్ ప్రవీణ్ రాజు, సంయుక్త కార్యదర్శిగా నాగేందర్, మహిళ కార్యదర్శిగా రోజారాణి, కార్యవర్గ సభ్యులుగా జి.లక్ష్మి, ఎస్.శ్రీనివాస్, ఇఫ్కాకర్ అహ్మద్, కె.ఆనంద్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు కాచిగూడ కళాశాల ప్రిన్సిపాల్ ఏ.చిరంజీవి, ఆర్ఎల్‌డీ కళాశాల ప్రిన్సిపాల్ జి.రామానుజాచారి తెలిపారు. ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన అధ్యక్షుడు, కార్యదర్శి పేర్కొన్నారు.

మత్స్య సంపదతోనే అధిక ఉపాధి

అడిషనల్ డైరెక్టర్ డా. శంకర్ నాయక్ రాథోడ్

వ్యవసాయ యూనివర్సిటీ, సెప్టెంబర్ 27: రాష్ట్రంలో అతి పెద్ద వనరులైన మత్స్య సంపదను కాపాడుకోవడమే అధిక ఉపాధి అని రాష్ట్ర మత్స్య శాఖ అడిషనల్ డైరెక్టర్ డా. శంకర్ నాయక్ రాథోడ్ అన్నారు. రాజేంద్రనగర్ భారత ప్రభుత్వం సంస్థ సహకార నిర్వహణ సంస్థ (ఐసీఎం) సమావేశపు మందిరంలో శుక్రవారం ఏర్పాటు చేసిన రెండు జిల్లాల ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారుల శిక్షణ సమావేశానికి శంకర్ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం, దేశం, రాష్ట్రంలో ఎక్కువ ఉపాధి వనరులున్న మత్స్య సంపదను మనము ఉపయోగించుకుంటే, దేశానికి పౌష్టిక ఆహారం అందించడమే కాకుండా, మంచి ఆర్థిక సంపద పొందవచ్చన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డ అనతి కాలంలోనే వ్యవసాయ, అనుబంధ రంగాలకు, ప్రధానంగా మత్స్య సంపదకు ప్రాధాన్యత ఇచ్చారని, కృష్ణ, గోదావరి నుంచి నీటి వనరులు పెంచడం వల్ల విప్లవాత్మక మార్పు సంభవించిందన్నారు. రాష్ట్రంలో 24 వేల చెరువు కుంటలు, 82 రిజర్వాయర్లు ఉన్నాయని, ప్రస్తుతం అవి ఎక్కువ శాతం నీటితో నిండి ఉండటం వల్ల చేపలను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. మిగతా ఏ వనరులు ఇంత అందుబాటులో ఉండవని సూచించారు.

కార్యక్రమంలో ప్రసంగిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, చిత్రంలో తదితరులు

ప్రజల భాగ్యస్వామ్యంతోనే స్వచ్ఛత సాధ్యం

రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

సిటీబ్యూరో, సెప్టెంబర్ 27(నమస్తే తెలంగాణ): స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛత సాధ్యమవుతుందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. ఖైరతాబాద్‌లోని ఇందిరానగర్ కాలనీలో శుక్రవారం ఏర్పాటు చేసిన 'స్వచ్ఛత కి భాగిదారి' కార్యక్రమంలో గవర్నర్ పాల్గొన్నారు. ముందుగా ఇందిరాగనర్ కాలనీలో పర్యటించి కాలనీ స్థితిగతులను, పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. అనంతరం, గవర్నర్ మాట్లాడుతూ మన ఇల్లు, పరిసరాలు, మన బస్తీ, మన గ్రామం, మన రాష్ట్రం, మన దేశం పరిశుభ్రంగా స్వచ్ఛతతో సురక్షితంగా ఉండాలన్నారు. మన హక్కులతో పాటు బాధ్యతలు ఉంటాయని, స్వచ్ఛ సురక్షిత సమాజం కోసం ప్రతి ఒక్కరు తమ వంతు సహకారాన్ని అందించాలన్నారు. ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించినప్పుడే భవిష్యత్ బాగుంటుందని ఆయన సూచించారు. స్వచ్ఛత దేశ సేవలో భాగమని, స్వచ్ఛతపై ప్రతి ఒక్కరిని జాగృతం చేయాల్సిన అవసరముందని గవర్నర్ అన్నారు. ప్రిన్సిపల్ సెక్రటరి బుర్రా వెంకటేశం మాట్లాడుతూ, రాజ్‌భవన్‌కు, సెక్రటరియేట్‌కు దగ్గరగా ఉన్న ఇందిరానగర్ కాలనీని గవర్నర్ దత్తత తీసుకున్నారని తెలిపారు. కాలనీ స్వచ్ఛతతో పాటు కాలనీలోని ప్రతి ఇంటి అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంతకు ముందు గవర్నర్ కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరితో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట, స్థానిక కార్పొరేటర్ విజయారెడ్డి, జాయింట్ సెక్రటరీ భవానీ శంకర్, అడిషనల్ కమిషనర్ రఘుప్రసాద్, జోనల్ కమిషనర్ రవికిరణ్, శానిటేషన్ సిబ్బంది, కాలనీ ప్రజలు, మహిళలు, ఎన్‌జీవోలు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్టార్టప్‌ల పట్ల యువతలో విస్తృత అవగాహన

ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్ చైర్మన్ జేపీ చౌదరి

సిటీబ్యూరో, సెప్టెంబర్ 27(నమస్తే తెలంగాణ): యువతలో స్టార్టప్‌ల పట్ల ఎంతో అవగాహన పెరిగిందని, సరికొత్త ఆలోచనలతో సొంతంగా ఒక స్టార్టప్‌ను ప్రారంభించాలన్న పట్టుదల ఉందని ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్ చైర్మన్ జేపీ చౌదరి పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో జరుగుతున్న ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫెస్టివల్‌లో రెండో రోజు పలు కార్యక్రమాలను నిర్వహించారు. చౌదరి మాట్లాడుతూ నగరంలో నిర్వహిస్తున్న స్టార్టప్ ఫెస్టివల్‌కు మంచి స్పందన వచ్చిందని, వేలాది మంది ఔత్సాహికులు ఇక్కడ ఏర్పాటు చేసిన స్టార్టప్ స్టాళ్లను సందర్శించి, వాటి కార్యకలాపాలను తెలుసుకున్నారని తెలిపారు. అదే విధంగా ప్రారంభ దశలో ఉన్న స్టార్టప్‌ల వ్యవస్థాపకుల నుంచి దరఖాస్తులను స్వీకరించామని, అందులో అత్యుత్తమంగా ఉన్న 10 స్టార్టప్‌లను ట్రయంప్ ఐఎస్ఎఫ్ ఫిచ్ ఫెస్ట్-2024కు ఎంపిక చేశామన్నారు. స్టార్టప్‌లలో ఎక్కువగా ఫిన్ టెక్, అగ్రి టెక్ రంగాలకు చెందినవి ఉన్నాయని, వాటికి అవసరమైన ఫండింగ్‌తో మెంటరింగ్ చేసే అవకాశాన్ని తాము కల్పిస్తున్నామన్నారు. 53వేల స్టార్టప్‌లు రిజిస్ట్రేషన్ చేసుకోగా, అందులో 50ని ఎంపిక చేసి, వాటిలో టాప్ టెన్‌లను ఎంపిక చేశామని చౌదరి తెలిపారు. గచ్చిబౌలిలో 3 రోజుల పాటు నిర్వహిస్తున్న ఫెస్టివల్‌ను రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ వెంకట్ సందర్శించి, స్టార్టప్‌ల వ్యవస్థాపకులతో ముచ్చటించారు.

స్టార్టప్ స్టాల్స్‌ను పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ వెంకట్

నల్సార్‌కు నేడు రాష్ట్రపతి..

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ గౌతమ్

రాష్ట్రపతి నల్సార్ యూనివర్సిటీకి విచ్చేస్తున్న సందర్భంగా ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ కలెక్టరేట్, సెప్టెంబర్ 27: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నల్సార్ యూనివర్సిటీ 21వ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నందున ఏర్పాట్లు పూర్తి చేయాలని మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టర్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. యూనివర్సిటీలో ఏర్పాట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. నల్సార్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కృష్ణదేవరావు కలెక్టర్‌కు పలు విషయాలను వివరించారు. కార్యక్రమంలో కీసర ఆర్డీఓ వెంకట ఉపేందర్ రెడ్డి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ పని తీరుకు నిదర్శనం.. ఈ దృశ్యం

భారీ వర్షాలు పడినా చుక్క నీరు నిలవదని, స్టాగ్నేషన్ పాయింట్ల వద్ద ఎప్పటికప్పుడు నీరు తోడేస్తున్నామని చెప్పుకునే జీహెచ్ఎంసీ అధికారులు ఆచరణలో మాత్రం విఫలమవుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సర్కిల్ 17 పరిధిలోని ఖైరతాబాద్‌లో ప్రసాద్ ఐమ్యాక్స్ థియేటర్ పక్కనే హెచ్ఎండీఏకు సంబంధించిన విశాలమైన స్థలం ఉంది. నిత్యం ప్రసాద్ ఐమ్యాక్స్‌కు, 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని చూసేందుకు వందలాదిగా పర్యాటకులు, సందర్శకులు తరలివస్తుంటారు. థియేటర్ పక్కనే చెరువును తలపించేలా నీరు రోజుల తరబడి నిలిచిపోవడంతో దుర్గంధంతో పాటు దోమలు వృద్ధి చెంది స్థానికులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. – ఖైరతాబాద్;

ఒమేగాలో విజయవంతంగా బయోనిక్ ఇంప్లాంట్ శస్త్ర చికిత్స

సిటీబ్యూరో, సెప్టెంబర్ 27: ఒమేగా హాస్పిటల్‌లో బయోనిక్ ఇంప్లాంట్ విధానంతో విజయవంతంగా పార్షియల్ మోకాలి శస్త్ర చికిత్స నిర్వహించారు. ఏడాది క్రితం స్ట్రోక్ బారినపడి కోలుకున్న 62 ఏండ్ల మహిళ కొంత కాలంగా మోకాలి నొప్పితో బాధపడుతున్నది. గచ్చిబౌలిలోని ఒమేగా ఆస్పత్రి ఆర్థోపెడిక్స్ క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ ఆదిత్య కపూర్‌ను సంప్రదించారు. వివిధ పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఆమెకు మోకాలిలోని కొంత భాగం దెబ్బతిన్నట్లు గుర్తించారు. అయితే, పూర్తి స్థాయి శస్త్ర చికిత్స నిర్వహిస్తే అది లిగమెంట్లపై ప్రభావం చూపే అవకాశం ఉంది. దీంతో, తెలుగు రాష్ట్రాల్లోనే తొలిసారిగా బయోనిక్ గోల్డ్ ఇంప్లాంట్‌ను ఉపయోగించి మోకాలికి పార్షియల్ రీ సర్ఫేసింగ్ శస్త్ర చికిత్స నిర్వహించారు. శస్త్ర చికిత్స ముగిసిన కొద్ది గంటలలో ఆమెను నడిపించారు. చిన్న కోత ద్వారా సర్జరీ చేయడం వల్ల రోగి వేగంగా కోలుకోవడమే కాకుండా మరుసటి రోజే డిశ్చార్జి అయ్యి వెళ్లిపోవచ్చన్నారు.

మాంగళ్య షాపింగ్ మాల్ ప్రారంభం

నార్సింగిలో సందడి చేసిన సినీనటి సంయుక్తా మీనన్

మైలార్‌దేవపల్లి, సెప్టెంబర్ 27: నార్సింగిలో మాంగళ్య షాపింగ్ మాల్ 21వ స్టోర్‌ను సినీ నటి సంయుక్తా మీనన్ శుక్రవారం ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి షాపింగ్ మాల్‌ను ఆమె ఆవిష్కరించారు. సంయుక్త మాట్లాడుతూ, తెలుగు రాష్ట్రాల్లో అధునాతన కలెక్షన్స్‌తో నిత్య నూతన వెరైటీలతో అతి పెద్ద షాపింగ్ మాల్ గా మాంగళ్య అవతరించిందన్నారు. ఈ స్టోర్‌ను నార్సింగిలో తాను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. పట్టు, ఫ్యాన్సీ, కంచి, ధర్మవరం, ఉప్పాడ పట్టు చీరలతో పాటు అధునాతన కలెక్షన్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. కిడ్స్, ఎత్నిక్ వేర్, మెన్స్ అండ్ ఉమెన్స్ వివాహాది శుభ కార్యములకు ధరించే ప్రత్యేక వస్త్ర ప్రపంచం మాంగళ్య షాపింగ్ మాల్ అని పేర్కొన్నారు. సంయుక్త మీనన్ షాపింగ్ మాల్‌లోని పట్టు, ఫ్యాన్సీ సెక్షన్లు, ఎత్నిక్ వేర్, లేడీస్ అండ్ జెంట్స్, కిడ్స్ వేర్ అంతా కలియతిరిగి సందడి చేశారు. ఈ ప్రాంత వాసులు దసరా షాపింగ్ మాంగళ్యలో చేయాలన్నారు. మాల్ డైరెక్టర్లు పీఎన్ మూర్తి, కాసం నమశ్శివాయ, మల్లికార్జున్, కేదరీనాథ, శివప్రసాద్, పుల్లూరు అరుణ్ కుమార్‌లు మాట్లాడుతూ, తెలుగు రాష్ట్రాల్లో 12 ఏండ్లుగా ప్రజల మన్ననలు పొందుతూ ఇప్పటి వరకు 21 స్టోర్స్ ప్రారంభించినట్టు తెలిపారు.

మంగళ గౌరి షాపింగ్ మాల్ ప్రారంభం

పీర్జాదిగూడలో తలుక్కుమన్న సినీ తార కృతిశెట్టి

పీర్జాదిగూడ, సెప్టంబర్ 27: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన మంగళ గౌరి షాపింగ్ మాల్‌కు ప్రముఖ సినీతార కృతిశెట్టి శుక్రవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించింది. అనంతరం, షాపింగ్ మాల్‌లో వినియోగదారుతో కలిసి సందడి చేసింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహి